# మానవుల అడుగుజాడల్లో

**ఆవుల సాంబశివరావు**

అది రాత్రివేళ. హైకోర్టు న్యాయమూర్తి నారాయణమూర్తిగారి పడకగది. గది మధ్యలో పడక. పడక ప్రక్కనే ఒక టీపాయి. దానిమీద ఒకలైటు, టెలిఫోను. వాటిప్రక్కనే, ఆ పగలు జడ్జీగారివద్ద కోర్టులో వాదన జరిగిన 'సీతారామయ్య Vs ఆంజనేయులు' అనే సెకండు అపీలురికార్డు పెట్టి వున్నది. ఆ కట్టమీదనే 'ఫ్రాయిడ్' కలలమీద వ్రాసిన పుస్తకం తెరిచివుండి, కాగితాలు గాలికి కొట్టుకుంటూ వున్నవి. గోడప్రక్కగా సోఫాలు అమర్చబడివున్నవి.

న్యాయమూర్తి నవీనుడు. హాస్యప్రియుడూను. మంచి నిద్రలో ఉన్నాడు.

ప్రవేశము తొందరతొందరగా మహావిష్ణువు. గిరజాలు రేగివున్నవి. చొక్కా లేదు. ఉత్తరీయంలేదు. బొజ్జమీద. నుదురుమీద, శ్రమనుసూచిస్తూ, చెమటబిందువులు కనిపిస్తున్నవి. వెనుక లక్ష్మీదేవి ఆయోమయంగా పరుగెత్తుకుని వస్తున్నది. జారుముడి సడలినది. ముంగురులు చిందరవందరగా రేగినవి. కుంకుమబొట్టుచెరిగివున్నది.

దృశ్యమంతా 'సిరికిం జెప్పడు, శంఖు చక్రయుగమున్ జేదోయి సంధింపడు....' అన్న గజేంద్రమోక్ష ఘట్టం స్ఫురణకు తెస్తుంది. ఇద్దరూ జడ్జీగారి పడకగది వాకిలి ముందు ఆగారు.

లక్ష్మీదేవి : ఏమిటి స్వామీ యీ గడబిడ! రొమ్ములు పగులుకుంటూ ఎందుకీ పరుగు?

విష్ణువు : (చికాకుతో) ఎందుకు? ఎందుకని అడుగుతున్నావా పైగా? వినలేదు ఆ సీతారామయ్యా ఆఘోరింపు? అతని దీనాలాపన. నీ చెవిని పడనే లేదా? నన్నునమ్మి, సర్వస్వము నేనే అనుకుని ఉండికూడా, దిక్కులేకుండా ఎలా అలవటిస్తున్నాడో నీవు ఎరుగనే ఎరుగవా?

లక్ష్మి : అదికాదు హుజూర్ (హిందీబాణీ ఆవిడకుకూడా అబ్బింది) ఇంతకు అతనికి కలిగిన విపత్తు ఏమిటీ అని?

వి : విపత్తు అని మెల్లగా అంటున్నావా? అతని ప్రహరీగోడమీద. అతని విరోధి ఆంజనేయులుగాడి చూరునీళ్లు పడుతూ వుంటే. ఆ దుండగము ఆపడానికి మూడు కోర్టులూ తిరిగాడు. ఎక్కడి కక్కడ. ఆ దుష్టుడు ఆంజనేయులు, ఏమిలంచాలు పెట్టాడో, మనవాడిని భస్మీపటలం చేశేస్తున్నాడు.

ల : అయితే, యీ భాగోతం చాలా రోజులుగా జరుగుతూ ఉండాలిగా. ఇవ్వాళ, యీ తొందరేమిటి నాకుబోధపడ్డలేదు.

వి : క్రింది రెండుకోర్టుల్లోను ఓడిపోయి, తీరా ఆఖరుకోర్టులో ఏ మవుతుందోనని ఆదుర్దాపడుతు, ఓడిపోయి గ్రామంలో తలెత్తుకు తిరగలేక, కుమిలిపోతూ, నన్ను తలచుకుని అదేపనిగా అలవటించిపోతున్నాడు. ఆర్తత్రాణ పరాయణత్వం లేని, దివ్యత్వం మనకుదేనికి?

ల : అయితే, మొన్న ఆ వితంతువు, మిమ్మల్ని అంతగా ప్రార్థించినా, మీ మనసు కరగలేదు. ఈ భక్తుడి విషయంలో. ఇంతగా తాపత్రయపడుతున్నారేమిటి ప్రభూ!

వి : ఆ విధవముండకి, యీ సీతారామయ్యకు సాపత్యమా! తీసుకువచ్చావ్ భలే పోలిక!

ల : కాక ఏమీ! చూరు నీళ్ళ తగువూ, వీడూనూ! పాపం! ఆవిడ ప్రాణం మీదకువచ్చి అల్లాడిపోతేనూ!

వి : (విసుగ్గా) సీతారామయ్యా అంటే, విధవముండల్లాంటి సామాన్యభక్తు డనుకుంటున్నావు. వాడు లక్షాధికారి.

ల : లక్షాధికారైతే. చూరునీళ్ళ దగ్గర తగువేమిటి, వాడి పిండాకూడు!

వి : అలాగా. నీకేం తెలుస్తుంది ఆడదానికి చూరు నీళ్ళల్లో ఉండే పట్టుదల? ఇంతకు వాడికి యీ పని ఊరికెనే చేసిపెడుతున్నామనా నీ కించ?

ల : ఏం పుచ్చుకున్నారేమిటి. కష్టంక్రింద?

వి : మొన్న పార్థసారథి ఆలయంనుండి వచ్చిన చక్రపొంగలి ఎవరిదనుకున్నావు? తిరుపతినుండి వచ్చిన పులిహోర భోగం మీ కన్నవారు పంపించారనుకున్నావా? పాపం. వాడు మన గుడి, గుడికీ తిరిగి అర్పించుకుంటున్న అల్పాహారాలు అన్నీ ఇన్నీ కావు. మన యి.ట్లో పులిహోర ఎన్నడైనా అంత బాగా కుదిరిందీ! ఊరికే మాటలు చెబుతావుగాని!

ల : అయితే పులిహోరకు. చక్రపొంగలికి ఆశపడన్నమాట యీ హడావుడంతా!

వి : పులిహోర, చక్రపొంగలి ఊరికే ఉపాయనంగా మాత్రమే అర్పించుకుంటున్నాడు. అపీలు గెలిస్తే, వరదరాజస్వామి ఆలయం ద్వారా మనకు వెండి కిరీటం చేయిస్తానన్నాడు. ఎటూ నేను ఒకకిరీటం చేయించుకోకతప్పదు. ఉన్నది కాస్తా. మన పోకిరీ వెధవ, ఆడుకొంటూ విరగగొట్టాడుకదా!

ల : ఎంత సేపూ మీ సొంత ఆలోచనే కదా! అందుకనే మగవాళ్లు స్వార్థపరులనేది.

వి : అదా నీ బెడద! కల్లో కనిపించి, నీ కొక పట్టెడకూడా చేయించమని కోరదాములే.

ల : వెధవ పట్టెడ! ఈరోజుల్లో 'నాజూకైన నెక్లెసులు వస్తూవుంటేను.

వి : (విసుగ్గా) పోనీ అదే అఘోరిద్దాంలే. పుణ్యకాలం కాస్తా యిక్కడే అయిపో తున్నది, నీ చొప్పదంటు ప్రశ్నలతో. వచ్చినపని కాస్త చూచుకుందాం.

(సందేహిస్తూ జడ్జీగారి పడకగది ప్రవేశిస్తారు.)

జడ్జీగారు : (చూచి) ఎవరన్నా మహాను భావులు ! (వెనుక లక్ష్మిదేవిని కూడా చూచాడు) ఆడవారుకూడా ఉన్నారు. అర్థరాత్రివేళ, పరాయి మొగవాడి పడక గదిలో…….

విష్ణు : (మాట మధ్యలోనే అందుకొని) పెనిమిటితో కలిసి వచ్చినా, తప్పే నటయ్యా. నీయిల్లు బంగారంకానూ !

జ : (కొంత కొంటెతనం, ఓపిసరు అలవాటు మితంకాగా) తప్పు కాదన డానికి మీకు అథారిటీ ఏమిటి ?

వి : అథారిటీ ఏమిటి ! మాకు అథారిటీలతో నిమిత్తంలేదు. మమ్మల్ని ఎరక్క అలా అంటున్నావు. ఈవిడ సాక్షాత్తూ శ్రీ లక్ష్మీదేవి. నీ యింటికి సిరి రా మోకా లొడ్డుతున్నావు. మేము……..

జ : సాక్షాత్తూ శ్రీ విష్ణుమూర్తులు. నమస్కారం. నమస్కారం. ఇలా దయచేయండి. (ఆసనాలు చూపు తున్నాడు.) ఎన్నడూ రానివారు దయ చేశారు. ఆతిధ్యం యివ్వడానికి సోమ రసంకూడా లేక….


వి : అబ్బే దానికేముందిలే ! భగద్భక్తి వుంటే అదే చాలు. మీ నాన్నగారు ఎప్పుడూ మా చింతలోనే ఉండేవారు. నీవు కేవలం మా వరప్రసాదివి.

జ : ధన్యుణ్ణి స్వామీ !

వి : అందువల్ల చిన్నప్పటినుండి. నీవంటే మా కెంత అభిమానమనీ ! పసితనంలో నీవు పిన్నీసు మింగావు. మింగి అతల కుతల మవుతూంటే, మీ అమ్మ మాకు ముడుపు కట్టింది. వెంటనే ఆ పిన్నీసు బయటకు కక్కించాము.

జ : డాక్టర్ సుబ్రమణ్యంగారు మందిచ్చి కక్కించారని విన్నానులెండి.

వి : వాడిది ఒక నెపంగాని. మేము లేక



పోతే వాడివల్ల అయేదా! అది సరేలే! నీవు యీ లోకంనుండి ఫించను పుచ్చుకున్నాక....

జ : శుభం పలకరా మంకెన్నా అంటే.... అన్నట్లుగా వుంది మహాత్మా!

వి : ముందుమాట చెబుతున్నాము గాని. నూరేళ్ళు వర్థిల్లి, ఫించను పుచ్చుకున్నాక, అక్కడికి ఇక్కడికి వెళ్ళకుండా. సరాసరి మన విష్ణులోకం వచ్చేయి. (లక్ష్మితో) నాకు రేపు జ్ఞాపకంచెయ్యి. ఆనంద సరోవరం ప్రక్కన ఉన్న బంగళా మనవాడికి ప్రత్యేకించి ఉంచవలసిందని, మన. సునందునితో చెబుతాను.

జ : సునందుడెవరు స్వామీ!

వి : మన విష్ణులోకంలో వసతి సౌకర్యాల అధికారిలే. స్వర్గలోకంనుండి మొన్ననే ఊర్వశినికూడా లేవదీసుకుని వచ్చాము. ఆ ప్రక్క మేడలోనే వుంటుంది. ఏం! (అని కన్నుగొడతాడు)

జ : చాలాచాలా ధన్యవాదాలు. కాని ఎందుకు, ఎన్నడూలేనిది, స్వామివారికి యీ అల్పునిమీద ఇంత నిర్హేతుక కరుణాకటాక్షము. ఊరకరారు మహాత్ములు. అందులో సతీసమేతంగా వచ్చేశారు. అసలు కార్యం సెలవిప్పించండి.

విష్ణు : ఏమీ లేదోయ్! నా వరప్రసాదివి కదా, చూచి వెళదామనీ....



జ : పుట్టినదగ్గరనుండీ మీ వరప్రసాదినే మహాత్మా! ఇవ్వాళటి ప్రత్యేకత ఏమో తెలియడంలేదు.

వి : అంతగా అడుగుతున్నావు గనుక చెబుతున్నాను. పెద్ద విషయమేమీలేదు. నీవు తలుచుకుంటే ఎంతపని! ఏదో ఇవ్వాళ నీవద్ద విచారణ జరిగినదట, సీతారామయ్య గోడ తగువు....

జ : అది మీదాకా వచ్చినదా. దేవా!

వి : వాడు మా భక్తుడు. వాడిది న్యాయమై వుండి కూడా, చాలా అవస్తపడుతున్నాడు....

(అకస్మాత్తుగా, హనుమంతుడు, కిటికీ గుండా గదిలోకి దూకుతాడు. పురాణాల్లో వర్ణించినట్లుగా ముందుకు పొడుచుకు వచ్చిన మూతీ, వాలం, యిత్యాది అంగసౌష్టవం కలిగి, ప్రస్తుతం రౌద్రమూర్తియై కోపంతో ఊగిపోతున్నాడు. ఆయన్ని చూచి విష్ణుమూర్తి. లక్ష్మిదేవి ఉలిక్కి పడతారు.)

హను : ఎవడిది న్యాయం! ఆ సీతారామయ్యది న్యాయమా! ఎవడు చెప్పాడయ్యా పెద్దమనిషీ! కిటికీ ప్రక్కన వుండి వింటున్నాను, యిందాకటినుండి నీ మాటలు. ఇన్నేళ్ళు వచ్చికూడా, అబద్ధాలు మానలేదయ్యా నీవు.

విష్ణు : ఎవరు! హనుమంతా! నీవేనా! నా ప్రియభక్తుడివి అయివుండి కూడా, తారతమ్యం లేకుండా. పరాయి పెద్దమనిషి ఉన్నాడని కూడా వెరవకుండా, ఏమిటా దుడుకు మాటలు!

హను : చాలు లేవయ్యా నీ నంగి నంగి మాటలు. నా భక్తుడి కొంప నిలువునా తియ్యడానికి సిద్ధమయావు.

జ : (ఈ తగువుచూచి ఆనందిస్తున్నాడు) (హనుమంతుడితో) ఇందులో మీభక్తుడు ఎవరు స్వామీ! నించునే ఉన్నారు. ఇలా ఆసీనులుకండి. (కుర్చీచూపుచున్నాడు.)

హను : (నించునే) ఈ మహా విష్ణువుగారు చెప్పేదంతా నమ్మేవు! అదంతా శుద్ధాబద్ధం. సీతారామయ్య అపీలులో ఎదురు పార్టీలేడూ — ఆంజనేయులు — వాడు

నికారుసైన ధర్మవాది. అబద్ధమాడి ఎరుగడు. చూరు నీళ్ళు పడడానికి వాడికి ఎంతైనా హక్కు ఉన్నది.

జ : చూచినట్లు చెబుతున్నారు. పవన నందనా ! అక్కడికి వెళ్ళి వచ్చారా?

హను : చూచిరావాలా? నా భక్తుడి సంగతి నే నెరగనూ !

జ : ఆ ఆంజనేయులు అంత నమ్మకస్తుడని ఎలా ఎరుగుదురు స్వామీ !

హను : వాడిమీద నెపమెన్నడానికి వీలున్నదా ? ఆడినమాట వాడెన్నడైనా తప్పాడా ? అన్న ప్రకారం ఎన్ని సహస్రనామ పూజలు చేయించాడు కాదు ! పానకం, వడపప్పు, వాడివల్ల ఎన్నిసార్లు పొందలేదు? మాటఅన్నాడూ అంటే చెల్లితీరవలసిందే !

లక్ష్మి : (ఎత్తిపొడుపుగా) ఈ కేసులో ఎంతేమిటోయ్ గిట్టుబాటు హనుమంతూ !

హను : (కోపంగా) మీకంటె తక్కువే ముట్టిందిలే. అయినా నాకేమైనాభయమా నిర్భయంగా చెబుతాను. నా భక్తునిమీద నాకు అరమరలేని నమ్మక మున్నది. క్రిందికోర్టులో గెలిచినందుకు నాకు రాగితొడుగు చేయించాడు. ఇప్పుడు కూడా గెలిస్తే, వెండి భుజకీర్తులు చేయిస్తానన్నాడు.

జ : (హనుమంతునితో హేళనగా) మీరు ఎంతచెప్పినా నాకు నమ్మకం కుదరటం లేదు. మొక్కుకున్నదేదో వ్రాతపూర్వకంగా లేకపోతే, పబ్బం గడుపుకుని, చివరకు గురువుకు పంగనామాలు పెడతాడేమో మీ శిష్యుడు.

(హనుమంతుడు వినిపించుకోనట్లు నటిస్తాడు.)

వి : లక్ష్మీ ! నేను చెప్పలేదూ, ఆ మాయల మారి ఏదో చేసే క్రిందికోర్టులో నెగ్గాడనీ ! (హనుమంతునివైపు తిరిగినవ్వు ముఖంతో) హనుమంతూ ! నీ శిష్యుణ్ణి క్రింది రెండు కోర్టుల్లోను గెలిపించావు, చాలదూ! ఈసారి మావాడిని గట్టెక్కనీ !

హను : ఈ రాజీలు నావద్ద కుదరవు. చివరికి మోసం చేస్తావు. మొన్న రామవరం ఖూనీకేసులో ఏంజేశావు ? రాజీకి వప్పుకున్నందుకు, చివరికి నా నెత్తిన చేతులుబెట్టి, నాపార్టీ వాళ్ళకు శిక్షలు వేయించావు. ఏమైనాసరే. నేను వప్పుకోను. నా భక్తుడు ఆంజనేయులు గెలిచి తీరవలసిందే.

వి : హనుమంతా ! నా పరువు తీశేస్తున్నావు. ఇక సహించడానికి వీలులేదు.

హను : (కోపంతో) ఏమిటయ్యా నీవు చేసేది సహించక తలగొట్టి మొల వేస్తావా ? నీ పటాటోపం నే నెరగంది కాదు. (అని వాలం తిప్పుతున్నాడు)

వి : లక్ష్మీ ! ఇక సహించలేను. ఈ అవమానము దుర్భరము. నాచక్రము తెమ్ము.

ల : అయ్యో ! నిన్న పండ్లు తరుక్కొని. పొదరింటి చూరులో పెట్టాముకదా ! అక్కడనుండి తియ్యనేలేదు.

వి : ఏమిరా భగవంతుడా ! ఇప్పుడు ఏ విధంగా యుద్ధం చేసేది !

హను : హ్రాం, హ్రీం, హ్రూం (గర్జిస్తున్నాడు)

వి : కానిమ్ము. మదీయ భుజస్కంధములతోనే యుద్ధము గావింతును. (జబ్బలు చరుస్తున్నాడు)

జ : (ఇద్దరి మధ్యకు వచ్చి) మీ గొడవ మీదేనా ఏమిటి ? నా మాట ఆలోచించే దెవరూలేరే ! ఇంతకు, తీర్పు చెప్పవలసింది నేనా, మీరా !

(విష్ణువు. హనుమంతుడు నిలబడి చూస్తున్నారు.)

జ : (కఠినంగా) మీ రిద్దరు చెరొకవైపున లంచాలు తిని, పల్లెటూరి పాడు పైరివేట్లులాగా, అటుఇటు కొమ్ముకాచి తగువులాడుతూ బ్రతుకుతున్నారా ! దుష్టమానవుల అడుగుజాడల్లోనే మీరూ సంచరించేది ! మీకు సిగ్గు లేదూ ! ఇదేనా మీ దివ్యత్వం !

వి : మర్యాద అతిక్రమిస్తున్నావు. జాగ్రత్త !

హ : శుద్ధ మానవుడివి. ఇంత అహంకారమా నీకు! చూడు ఏంజేస్తానోనిన్ను.

ల : దేవుడు, దెయ్యమనీ లేకుండా మిట్టిపడకు. కపడ్దార్ ! నిన్ను శపిస్తాను.

జ : (హేళనగా) శాపాలు, తాపాలు తరవాత సంగతి. ముందుగా మీ ముగ్గుర్నీ, న్యాయ పాలనకు అడ్డువచ్చినందుకు, లంచగొండితనానికి అరెష్టు చేయిస్తాను.

(టెలిఫోను తియ్యబోతున్నాడు)

వి : మాకు మీ 'లా'లు ఏమి వర్తిస్తవోయ్, పిచ్చివాడా ! వాటినిచూచి కులుకబోకు. మేము దేవతలం.

జ : అయితే అవుదురుగాక ! మా భూలోకంలోకి వచ్చి. యిటువంటి తప్పుడు పనులు చేస్తున్నప్పుడు, మీరు మా హయాంలోకే వస్తారు. మీ పని మరీ హద్దూ పద్దూ లేకుండా ఉన్నది. ఒక పాఠం నేర్పితేనేగాని....

(విష్ణువు. లక్ష్మి. హనుమంతుడు ఒకళ్ల ముఖం ఒకళ్లు భయంగా చూచుకొంటున్నారు.)

హ : (పళ్ళబిగువుతో) అరెష్టు చేస్తే ఏమవుతుందేమిటి ?

జ : ఏమవుతుందా ? పది సంవత్సరాలు కృష్ణజన్మస్థానం లభిస్తుంది.

హ : ఏం ఫరవాలేదు.

జ : జైలు కెళితే, రాజకీయ బాధితుడుగా అయిదెకరాల పొలం వస్తుందనుకుంటున్నారేమో! ఆ పప్పులేం ఉడకవు. జైల్లోవుండి పది ఔన్సుల ఉప్పుడు బియ్యం. రోజుకో కానీ మజ్జిగ తింటూ, కొండరాళ్ళు బద్దలు కొడుతూంటే....

వి : (జంకుతూ) అవి మాకుకూడానా ?

జ : ఏం మీరుమాత్రం లంచాలు తీసుకోలేదూ ! ఏమిటనుకుంటున్నారో ! మా జీవితాలు అనుభవించాక. మీ నరకమంటే లెక్కేమి టంటున్నారు మావాళ్ళంతా.

ల : అమ్మయ్యో !

హ : నిజంగానా.

జ : (టెలిఫోను తీస్తూ) మాటలు చెబుతూ అక్కడే నిలుచోండి. ఇంతలో పోలీసులు వస్తారు.

(మహావిష్ణువు. లక్ష్మీదేవిని లాగుతూ, ఆదరాబాదరా బయటకు పరుగెత్తుతాడు. ఈ సందట్లో హనుమంతుడు కిటికీలోంచి తుర్రుమంటాడు. అంటే భగవత్పరిభాషలో అంతర్ధాన మవుతారు.)

తెరచివున్న ఫ్రాయిడ్ పుస్తకం, గాలికికామాలు క్రిందపడుతుంది. శబ్దానికి మెలుకువవచ్చి, జస్టిస్ నారాయణమూర్తి. క్రిందపడిన పుస్తకాన్ని అందుకొంటూ, కలను తలచుకుని మందహాసంచేస్తాడు.★